# అభివృద్ధి పనుల పరిశీలన

## కడా కార్యాలయంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు అధికారులతో సీడీఎంఏ వీపీ గౌతమ్ సమీక్షా సమావేశం



కడా కార్యాలయంలో మున్సిపల్ అభివృద్ధిపై అధికారులతో వీపీ గౌతమ్ సమీక్షా సమావేశం, చిత్రంలో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, అక్టోబర్ 7 : మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు ప్రపోజల్స్ చేశారు. సోమవారం సీడీఎంఏ వీపీ గౌతమ్ మున్సిపల్ పరిధిలో పర్యటించి అభివృద్ధి చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు అధికారులతో కడా కార్యాలయంయలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ కూడలి, లాహోటీ కాలనీలో పార్క్, పాత కొడంగల్ ప్రాంతంలోని ఎడ్యుకేషన్ హబ్ స్థలం, కొడంగల్ పెద్ద చెరువు వద్ద లేక్ వ్యూ డెవలప్‌మెంట్, మినీ స్టేడియం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఇంటర్నల్ రోడ్స్, డంపింగ్ యార్డ్ తదితర అభివృద్ధి పనుల నిర్వహణపై అధికారులతో చర్చించారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళిక, పనుల ప్రారంభం వంటి వాటితో పాటు మున్సిపల్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి వివరాలను సీడీఎంఏ అధికారులతో వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### పారిశుధ్యం, పచ్చదనంపై శ్రద్ధ పెట్టాలి

పరిగి : పారిశుధ్యం, పచ్చదనంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీడీఎంఏ గౌతమ్ మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. సోమవారం పరిగిలోని మున్సిపల్ కార్యాలయాన్ని కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా భువన్ యాప్‌లో ఇండ్ల వివరాల నమోదు, స్వచ్ఛ ఆటోలకు జీపీఎస్ ట్రాక్, పన్నుల వసూలును పర్యవేక్షించడంతోపాటు జంతు జనన నియంత్రణ కేంద్రంలో కుక్కలకు కు.ని. ఆపరేషన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ, డంపింగ్‌యార్డు విషయం అడిగి తెలుసుకున్నారు.

డంపింగ్‌యార్డు కోసం సర్వే నం.50లో 4 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించారని అధికారులు సీడీఎంఏకు వివరించారు. మున్సిపల్‌లో పనిచేసే ఏఈ పదోన్నతిపై వెళ్లడంతో అభివృద్ధి పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతున్నదని సీడీఎంఏ దృష్టికి తీసుకురాగా ఏఈ నియామకం చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, కమిషనర్ వెంకటయ్య, డీఈఈ రాకేశ్, మేనేజర్ నరేశ్‌కుమార్, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

రైతులు ఇబ్బందిపడకుండా

# వరి ధాన్యం కొనుగోలు చేయాలి

- ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, అక్టోబర్ 7 : రైతులు ఇబ్బందిపడకుండా ఐకేపీ కేంద్రాల ద్వారా వానకాలం పంట వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా సరిహద్దు చెక్ పోస్టుల వద్ద నిఘా పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం వికారాబాద్ జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలో లింగ్యానాయక్ తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి వచ్చే ధాన్యాన్ని ఐకేపీ 21, పీఏసీఎస్ 62, డీసీఎంఎస్ 22, ఎఫ్‌పీఓ 2, మొత్తం 107 కేంద్రాల ద్వారా 100 శాతం కొనుగోలు చేయాలన్నారు. ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. తగిన ప్రణాళికతో సజావుగా ధాన్యం కొనుగోళ్లు జరగాలని తెలిపారు. జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో వరి సాగైనందున, లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నదన్నారు.


ప్రభుత్వం గ్రేడ్-ఏ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2320, సాధారణ రకం రూ.2300, సన్న రకానికి అదనంగా రూ.500 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు అవసరమైన తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, కాంటాలు, టార్పాలిన్లు, గన్నీ సంచులను వెంటనే కొనుగోలు కేంద్రాలకు పంపాలని సూచించారు. వ్యవసాయ అధికారుల వద్ద ఉన్న వరి కోతల వివరాల ఆధారంగా రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చేలా ప్రణాళిక చేసుకోవాలన్నారు. రైతులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, సివిల్ సప్లై అధికారి మోహన్‌బాబు, డీఎం విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి సారంగపాణి ఉన్నారు.

## న్యాయం చేయాలి

కొడంగల్, అక్టోబర్ 7 : అభివృద్ధి పనుల్లో భాగంగా మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలో మెడికల్ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. భూమి అందించిన రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో అవకతవకలు జరిగాయని సోమవారం పట్టణానికి విచ్చేసిన కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కడా కార్యాలయంలో కలిసి భూ బాధితులు తమ గోడును విన్నవించుకున్నారు. భూమికి తగినంతగా ప్రభుత్వం అందిస్తామన్న నష్టపరిహారం అరకొరగా అందిందని, నష్టపరిహారం చెల్లించడలో ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. నష్టపరిహారాన్ని చెక్కుల రూపంలో అందించారని, కానీ ఉన్న భూమికి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం చెల్లింపులు జరగలేదని వాపోయారు. ఎక్కువ భూమిని తీసుకొని తక్కువగా చెల్లింపులు చేశారని, అర్హులకు కాకుండా అనర్హులకు కూడా ఇందులో వాటా ఇచ్చారని ఆరోపించారు. అభివృద్ధికి సహకరించాలనే ఉద్దేశంతో బంగారం పండే భూములను వదులుకున్నామని, ఓ విధంగా కన్న తల్లికి దూరం అయినట్లుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాన్ని సీఎం గుర్తించాలని కోరారు. ఉన్న భూమి మేరకు ఆ ప్రకారమే చెల్లింపులు చేపట్టాలని కోరారు. రైతుల ఆవేదనకు కలెక్టర్ స్పందించి త్వరలోనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టి భూ బాధితులకు సరైన న్యాయం చేయాలని తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# అభివృద్ధి, సంక్షేమ రంగాలకు ప్రభుత్వం పెద్దపీట

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- త్వరలో కొత్త రెవెన్యూ చట్టం-2024ను ఆవిష్కరిస్తాం
- కడ్తాల్‌లో నూతన తహసీల్దార్ భవనాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించిన మంత్రి



కడ్తాల్‌లో తహసీల్దార్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, అక్టోబర్ 7 : కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాలకు పెద్దపీట వేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల్‌లో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.1.18 కోట్లతో నిర్మించిన తహసీల్దార్ నూతన భవనాన్ని సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంక, ఇన్‌చార్జి ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ ముంతాజ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భవనం ఆవరణలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు.

రాష్ట్రంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మిస్తామని మంత్రి తెలిపారు. రైతుల రుణమాఫీకి రూ.31వేల కోట్లకుగానూ ఇప్పటివరకు రూ.18వేల కోట్లు మాఫీ చేశామని, మిగతా వారికి త్వరలో రుణమాఫీ చేస్తామని తెలిపారు. త్వరలో రెవెన్యూ చట్టం-2024ను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకు ప్రతి నియోజకవర్గానికి 3,500 నుంచి 4 వేల ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తామన్నారు. కడ్తాల్‌లో ప్రభుత్వ దవాఖాన, సర్వేయర్, జూనియర్ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. మండలానికి ట్రామ్ సెంటర్ మంజూరు కావడం జరిగిందన్నారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. మండలంలో ఇనాం, వక్ఫ్ బోర్డుతోపాటు తదితర భూ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించడం జరిగిందని తెలిపారు. 3,200 భూ సమస్యలను 550కి తగ్గించడం జరిగిందన్నారు.

అనంతరం ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాలకు చెందిన 77 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆమనగల్లు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 75 మంది గీత కార్మికులకు కాటమయ్య కిట్స్‌ను ఎమ్మెల్యేతో కలిసి మంత్రి అందజేశారు. అంతకుముందు మంత్రిని ఎమ్మెల్యేతోపాటు నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు.


కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, పీసీబీ డైరెక్టర్ బాలాజీసింగ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహ, బీచ్యానాయక్, నాయకులు, డీటీడీవో రామేశ్వరి, తహసీల్దార్లు, ఎంపీడీవో సుజాత, డీటీ ఆదిత్య, సీఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఐలు, ఏడీ శ్రీనివాసులు, ఏఈలున్నారు.

## నేడు కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు

### బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ

రంగారెడ్డి, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : దసరా పండుగను పురస్కరించుకుని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం తెలంగాణ గెజిటెడ్ అధికారుల భవనం ప్రాంగణంలో తెలంగాణ బతుకమ్మ సంబురాలను నిర్వహించనున్నారు. ఈమేరకు సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో అధికారులు బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

## చిలుకూరు బాలాజీని దర్శించుకున్న సబితారెడ్డి



చిలుకూరు బాలాజీని, సుందరేశ్వరస్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి సబితారెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు

మొయినాబాద్, అక్టోబర్ 7 : చిలుకూరు బాలాజీని సోమవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి వారి చిన్న కుమారుడు కల్యాణ్‌రెడ్డి దంపతులతో కలిసి దర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ వారిచే ప్రత్యేక పూజలు చేయించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న సుందరేశ్వరస్వామిని వారు దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి, సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ మాణిక్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జీఎన్ రాజు, బీఆర్‌ఎస్ లీగల్ సెల్ మండల అధ్యక్షుడు సురేందర్‌గౌడ్, యాదవ మహా సభ మండల అధ్యక్షుడు చెన్నయ్యయాదవ్, మాజీ ఉపసర్పంచ్ ఆంద్రూ, నాయకులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు అందజేసిన అర్జీలను కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో ప్రజలందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చర్యలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణికి 57 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులున్నారు.

## షెఫర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ రాష్ట్ర కురుమ సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎమ్మె సత్యనారాయణ



కొత్తూరు, అక్టోబర్ 7: షెఫర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ రాష్ట్ర కురుమ సంఘం ప్రధాన కార్యదర్శిగా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు, కర్ణాటక ఎమ్మెల్సీ విశ్వనాథం, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎగ్గె మల్లేశం, ప్రధాన కార్యదర్శి, బండారు నారాయణ సమక్షంలో సత్యనారాయణను ఎన్నుకున్నారు. షెఫర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బూరుగడ్డ నరేశ్, ఉపాధ్యక్షుడిగా వస్పరి శంకర్, ప్రధాన కార్యదర్శిగా కొత్తూరు మండలం ఎస్‌బీ పల్లికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. కురుమల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. రాజకీయంగా కురుమలు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన కురుమ సంఘం నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## నేటి నుంచి లారీల బంద్

యాలాల, అక్టోబర్ 7 : సిమెంట్ కంపెనీలు లారీల కిరాయి పెంచకపోవడంతో నేటి నుంచి లారీల బంద్‌ను కొనసాగించనున్నట్లు స్థానిక లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సరుకు రవాణాకు లోకల్ లారీలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లారీల కిరాయిని పెంచకపోవడంతో తాము చాలా నష్టపోతున్నామన్నారు. సిమెంట్ కంపెనీలు తమ డిమాండ్లను నెరవేర్చే వరకు ఈ బంద్‌ను కొనసాగిస్తామన్నారు.

## బతుకమ్మ సంబురాలు

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 7 : శంకర్‌పల్లి మండల పరిధిలోని పిల్లిగుండ్ల గ్రామ శివారులో వనిత చేయూత మహిళ విభాగం సౌజన్యంతో సోమవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ స్పోక్స్ పర్సన్ భవానీరెడ్డి హాజరై బతుకమ్మ సంబురాలను ప్రారంభించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై బతుకమ్మ, దాండియా ఆట, పాటలతో నృత్యాలు చేశారు. బెస్ట్ ట్రెడిషనల్ బతుకమ్మ చేసిన మహిళకు మొదటి బహుమతి, మోస్ట్ క్రియేటివ్ బతుకమ్మ చేసిన మహిళకు రెండో బహుమతి, బతుకమ్మ బుట్ట బొమ్మగా రెడీ అయిన మహిళకు మూడో బహుమతిగా మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో టీడీఎఫ్ ప్రెసిడెంట్ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



బతుకమ్మలను తీసుకువస్తున్న మహిళలు

## ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

పరిగి, అక్టోబర్ 7 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా నేటికీ ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.వెంకట్రాములు విమర్శించారు. సోమవారం పరిగిలో జరిగిన నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేయాలని, ఇప్పటివరకు కొంతమందికే రుణమాఫీ జరిగిందన్నారు. వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12వేలు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. రంగాపూర్‌లోని ప్రభుత్వ భూమిలో పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. లేకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గత పదేండ్లలో అవలంబించిన కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు దుర్మార్గమన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలన్నారు. జమిలీ ఎన్నికల పేరిట ఫెడరల్ వ్యవస్థను నాశనం చేయాలని చూస్తున్నదన్నారు. ఈ సందర్భంగా సీపీఎం పరిగి డివిజన్ కమిటీ కన్వీనర్‌గా ఎం.వెంకటయ్యతో పాటు 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు జగదీశ్, జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



మండల పరిధిలోని నందివనపర్తిలో జ్ఞాన సరస్వతి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఆలయ ఫౌండర్ సదా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సామూహిక బతుకమ్మ సంబురాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ పాత్రికేయురాలు రాణి రుద్రమ హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ పాటలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. చివరకు బతుకమ్మలకు హారతి ఇచ్చి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ఉదయశ్రీ, సలహామండలి సభ్యులు, సమన్వయ ఉత్సవ మండలి సభ్యులు, మాతృ మండలి సభ్యులున్నారు.

– యాచారం, అక్టోబర్ 7

## రేషన్ బియ్యం పట్టివేత

షాబాద్, అక్టోబర్ 7: కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. షాబాద్ సీఐ కాంతారెడ్డి కథనం ప్రకారం.. సోమవారం మండలంలోని సర్దార్‌నగర్ గ్రామంలో శివకుమార్ అనే వ్యక్తి కిరాణా దుకాణంలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం రావడంతో సోదాలు నిర్వహించగా, అందులో 41 బస్తాలకుగాను 20 క్వింటాళ్ల వరకు బియ్యం దొరికినట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జియాలజిస్టులు, అసిస్టెంట్ ఇంజినీర్లకు శిక్షణా తరగతులు

### జీఎస్‌ఐటీఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాథ్యూ జోసెఫ్



శిక్షణా తరగతులకు హాజరయ్యేందుకు వచ్చిన జియాలజిస్టులు, అసిస్టెంట్ ఇంజినీర్లు

మన్సూరాబాద్, అక్టోబర్ 7: నాగోల్, బండ్లగూడలోని భారతీయ భూవైజ్ఞానిక సర్వే శిక్షణా సంస్థ (జీఎస్‌ఐటీఐ) కార్యాలయంలో సోమవారం 48వ బ్యాచ్ జియాలజిస్ట్స్, 4వ బ్యాచ్ అసిస్టెంట్ ఇంజినీర్ల ఓరియంటేషన్ కోర్సులు ప్రారంభమయ్యాయి. రిటైర్డ్ జీఎస్‌ఐటీఐ డైరెక్టర్ జనరల్ కుటుంబరావు, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాథ్యూ జోసెఫ్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అజయ్ అగర్వాల్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జోసెఫ్ మాట్లాడుతూ, యూపీఎస్సీ ద్వారా రిక్రూట్ అయిన గ్రూప్ ఏ సర్వీస్‌కు చెందిన 171 మంది జియాలజిస్టులు, ఐదుగురు అసిస్టెంట్ ఇంజినీర్లకు జీఎస్‌ఐటీఐలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణా సంస్థలో ఉన్న అనుభవజ్ఞులైన అధ్యాపకుల నైపుణ్యాన్ని ఉపయోగించుకుని తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు జియాలజిస్టులు, అసిస్టెంట్ ఇంజినీర్లు కృషి చేయాలన్నారు. రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ కుటుంబరావు మాట్లాడుతూ.. జీఎస్‌ఐ అత్యుత్తమ జియో సైన్స్ ఆర్గనైజేషన్ అన్నారు. ఈ సంస్థలో భాగస్వాములైనందుకు గర్వపడాలన్నారు. ట్రైనీలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా దేశంలోని ఏ ప్రాంతానికైనా పోస్టింగ్ లేదా బదిలీ ద్వారా వెళ్లి దేశానికి సేవ చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



జాఫర్‌గూడ భూదాన్ భూమిలో అక్రమ ఇంటి నిర్మాణాన్ని కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 7 : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం జాఫరన్‌గూడలోని సర్వే నం.319లో అక్రమంగా నిర్మించిన ఇంటిని, ప్రహరీని సోమవారం తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీ సహాయంతో కూల్చివేశారు. ప్రభుత్వ, భూదాన్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు, కబ్జాలు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బాటసింగారం సర్వే నం.10/106లో గ్రామస్తుడు జివ్వి సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి సర్వే చేయడం జరిగిందన్నారు. సర్వే రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇంద్రాణి, సర్వేయర్ జ్యోతి, సిబ్బంది ఉన్నారు.